www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య



విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు



వి.కొత్తకోట: ఉపాధ్యాయురాలు చితకబాదడంతో మూడో తరగతి విద్యార్థిని గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే... పట్టణంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో 3వ తరగతి గోపిక గణితంలో సరిగ్గా సమాధానం చెప్పలేదని కట్టెతో వీపుపై కొట్టింది. విద్యార్థి చర్మంపై వాతలు తేలాయి. విద్యార్థి నొప్పితో విలవిల్లాడిందని తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య చికిత్సలు చేయించి ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని తల్లిదండ్రులు ప్రశ్నించగా ఇలాంటి సంఘటనలు మామూలేనని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం శోచనీయం. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ సంఘటనకు కారణమైన ఉపాధ్యాయులిని, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రులు ఎంఇఒ రెడ్డిశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన టీచర్‌కు నోటీసులు జారీ చేశారు.

కమనీయం.. రమణీయం





- వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి
- భారీగా తరలివచ్చిన ప్రజానీకం
- యాత్రికులతో కిక్కిరిసిన ఒంటిమిట్ట
- ఆధ్యాత్మిక శోభతో పరవశించిన ఏకశిలానగరి



సీతారాముల కల్యాణ్యాన్ని వీక్షిస్తున్న మంత్రి రోజా, టిటిడి చైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

దేశంలోనే రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణం భక్త జనసందోహం, శ్రీరామ నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని పౌర్ణమి పండు వెన్నెల్లో తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సేవకులు పెద్దఎత్తున విచ్చేశారు. కడప-చెన్నయ్ ప్రధాన రహదారికి సమీపంలోని విశాలమైన మైదానంలో ఆకాశమంత చలువ పందిళ్లు వేసి పలు రకాల పూల పరిమళాలు, విద్యుత్ కాంతులు, భక్తుల కోలాటాలు, విద్యుత్ దీపాలంకారణలతో కూడిన కల్యాణ వేదిక వైకుంఠాన్ని తలపించింది. అంతకు ముందు సీతారాములవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ మండపం వద్ద ఆసీనులను చేశారు. వేదపండితులు ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక ప్రాంగణం నుంచి వీనుల విందుగా సాగిన వ్యాఖ్యానాలు, ప్రవచనాలు ప్రజలను తన్మయులను చేశాయి. కల్యాణ వేదిక ప్రాంగణంలో పలుచోట్ల ఎల్ఇడి తెరలను ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి ఏర్పాటు చేశారు. తమ వంశం గొప్పదంటే తమ వంశమే గొప్పదని కొంత మంది వేద పండితులు సీతమ్మ వైపు, శ్రీరాముల వారి వైపు మరికొందరుచేరి వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

శ్రీకోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగదబిరాముని కల్యాణానికి ప్రభుత్వం తరపున ముఖ్యఅతిథిగా హాజరైన గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. తరువాత వారికి ఆలయ విశిష్టత, రాములవారి ప్రాశస్త్యం, సీతారాము లకు చేయించిన బంగారు ఆభరణాల గురించి వివరించారు. శ్రీసీతారాముల విగ్రహాల శిరములపై జీలకర్ర, బెల్లం పెట్టారు. ఈ మహాద్భుత సన్నివేశాన్ని వేదపండితులు ప్రజానీకానికి చూపించి సీతమ్మ వారి మెడలో మగళసూత్రాన్ని ధరింపజేశారు. ఈ మహాద్భుత దృశ్యాన్ని చూసి తరించేందుకు విచ్చేసిన భక్తులు జైశ్రీరామా అనే రామనామ స్మరణలతో కల్యాణ వేదిక, కోదండరామాలయ పరిసర ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం తలంబ్రాల కౌంటర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. ఏకశిలానగరిలో కోదండ రాముడి కల్యాణానికి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ, మంత్రి రోజా, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కడప జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

భారీగా తరలి వచ్చిన భక్తజనం

సాయంత్రం 5 గంటల నుండి భక్తజనం భారీగా తరలివచ్చారు. ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటు చూసిన భక్తులతోనే నిండి ఉంది. సాయంత్రం ఆరు గంటలకే జనంతో నిండ పోయింది. చాలా మంది ప్రాంగణం బయట, హైవే రోడ్డుపై నిలిచి అక్కడ టిటిడి ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్‌లలో కళ్యాణ ఉత్సవాన్ని తిలకించి తరించారు



శివధనుర్భాలంకారంలో శ్రీరాముడు

ముత్యాల తలంబ్రాలుకు ఎగబడ్డ జనం

స్వామివారి కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం తలంబ్రాలు పంపిణీ చేసింది.. వీటికోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసింది. కౌంటర్ల వద్ద జనం ఎగబడ్డారు. ఒక దశలో జనం తలంబ్రాలు పొందేందుకు తోసుకున్నారు. పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు

అన్నదానం, మజ్జిగ పంపిణీ



శ్రీసీతారాముల తాళిబొట్లు, కంఠాభరణాలు

కల్యాణం సందర్భంగా విచ్చేసిన భక్తులకు టిటిడి, పలు ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు అన్నదానం నిర్వహించయి. కల్యాణ వేదికలో టిటిడి వారు మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు పంపిణీ చేశారు.

శివధనుర్భాలంకారంలో కోదండరాముడు

ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివ ధనుర్భాలంకారంలో రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్‌బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎఇఒ గోపాలరావు, సూప రింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



భారీ జనసందోహంతో నిండిన కల్యాణ వేదిక

జగనన్న లేఅవుట్లలో దొంగల బెడద

- సిమెంట్, ఇటుకలు, కడ్డీలు మాయం
- ఆందోళనలో లబ్ధిదారులు - పట్టని అధికారులు



లబ్దిదారులకు చెందిన ఇసుక, సిమెంట్, కడ్డీలు చోరీకి గురవుతున్న లే అవుట్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రంలోని నారాయణరెడ్డిగారిపల్లి వద్దనున్న జగనన్న కాలనీ లేవుట్‌లో దొంగల బెడద అధికమైంది. జిల్లా వ్యాప్తంగా 496 జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. జిల్లాలో రూ.73,756 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.13.24 కోట్ల నిధులు కేటాయించారు. ఒక్క గృహానికి రూ.1.80 లక్షల నిధులతో మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోనూ జగనన్న నివేసన స్థలాలు ఇచ్చారు. వేలాది మంది నిర్మాణ పనులు చేస్తున్న తరుణంలో దొంగలు బెడద ఎక్కువైంది. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన సిమెంట్, ఐరన్‌తో పాటు లబ్ధిదారులు సొంతంగా ఇసుక, ఇటుకలు తదితర నిర్మాణ సామగ్రి అపహరణకు గురువుతన్నాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. లేవుట్ జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్లు దూరం ఉండడం, సరైన రక్షణ లేకపోవడంతో దొంగలు బెడద ఎక్కువగా ఉంది. అసలే లేబర్ కూలీలు, బేల్దారి, ఇసుక, ఇటుకలు ధర ధరలు అధికం ఉండడంతో సామగ్రి రాత్రి వేళల్లో మాయం కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ విధంగా ఉంటే మారుమూల గ్రామాలలో పల్లెలకు దూరంగా ఉన్న లే అవుట్లలోని వారి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయం అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గృహ నిర్మాణ శాఖ, పోలీసులు చర్యలు తీసుకోవాలని దొంగలను నివారించాలని, లేవుట్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తమ దృష్టికి రాలేదు

జగనన్న కాలనీల్లో దొంగతనం జరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదు. కాలనీలకు సంబంధించిన తమ శాఖ అదికారులు డిఇ, ఎఇలు అందుబాటులో ఉంటారు. లబ్ధిదారులు ఎవరైనా అధికారుల దృష్టికి తీసుకెళ్తే పోలీసులకు ఫిర్యాదు చేసిన చోరీల నివారణకు చర్యలు తీసుకుంటాం.

- శివయ్య, హౌసింగ్ పీడీ, రాయచోటి.



రాయచోటి శివారులోని నారాయణరెడ్డిగారిపల్లె లేఅవుట్

వైభవం.. శ్రీపట్టాభిరాముడి పుష్పయాగం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం శ్రీపట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం పుష్పయాగంతో ముగిసాయి. స్వామివారికి పుష్పయాగం, మహానైవేద్యం, పుష్పప్రసాద వితరణ కార్యక్రమాలు టిటిడి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కన్నులపండువగా సాగింది. వేకువజామున స్వామివారికి సుప్రభాతం, శుద్ధి, పంచాంగ శ్రవణం, తోమాలసేవ, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. పుష్పయాగానికి తెచ్చిన 200 కిలోల వివిధ రకాల పుష్పాలను తిరుమాఢవీధుల్లో ఊరేగించి, పట్టాభిరామాలయంలో స్వామివారికి పుష్పయాగం, మహానైవేద్యం, పుష్పప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకిం చేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిలివచ్చారు.కార్య క్రమంలో ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, టిటిడి డిప్యూటిఇఒ వరలక్ష్మి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, సిబ్బంది నాగరాజ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు



కట్టా నరసింహులుకు నివాళి అర్పిస్తున్న విద్యావేత్తలు

బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టా నరసింహులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టు సభ్యులుగా, సంయుక్త కార్యదర్శిగా, బాధ్యులుగా, సలహామండలి సభ్యులుగా విద్వాన్ కట్టా నరసింహులు అందించిన సేవలు విస్మరింపరానివని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో బుధవారం నరసింహులు 76వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కట్టా సహచరులు, బంధువులు, మిత్రులు, తెలుగు పండితులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయన ప్రతిభాపాటవాలను కొనియాడారు. కట్టాతో గల అనుబంధాన్ని వారు నెమరు వేసుకున్నారు. ఒంటిమిట్ట కోదండ రామునికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున శ్రీరామనవమి ఉత్సవాలు జరగడానికి దేవాలయ ప్రాచీనతను, ప్రాభావాన్ని ఆధారాలతో సహా చూపించి ప్రధాన కారకుడయ్యాడని పేర్కొన్నారు. ఒంటిమిట్ట మండలం చిన్న కొత్తపల్లి గ్రామంలో జన్మించిన విద్వాన్ కట్టా నరసింహులు అంచలంచెలుగా ఎదిగి అత్యున్నత స్థితికి చేరుకున్న ప్రజ్ఞావంతులని కొనియాడారు. కార్యక్రమానికి ముందు వెంకటరమణ, రాయుడు, పాఠశాల వ్యవస్థాపకులు నందకిషోర్ గౌడ్, పతకమూరి వెంకటరమణ, పలుకూరు వెంకటరమణ, విద్వాన్ వల్లూరు చిన్నయ్య, బివి నారాయణరాజు, హరిప్రసాద్, సుబ్రహ్మణ్యం, వేల్పుల వెంకట సుబ్బయ్య, పలుకూరు భారతి, మల్లెల హైమావతి తదితరులు కట్టా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

8న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 8న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ రక్షణ రణభేరి కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ముదివేడు రిజర్వాయర్ ముంపు గ్రామాల్లో కూడా పర్యటించి బాధితులతో మాట్లాడనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఎంకు వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ఆర్‌టిసి డిపోలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బి.సి.శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాముకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రాజంపేట డిపో నుండి శ్రీశైలం, మదనపల్లి, పెంచలకోన, తిరుపతి మొదలగు సర్వీసులను నడపాలని కోరారు. డ్రైవర్లు, కండక్టర్లకు నూతన చార్ట్ వేయించాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి డిపో అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షులు రమణ, మౌలా, అంకయ్య, బాషా, సుబ్బయ్య, పుల్లయ్య చిన్నోడు, సీనియర్ నాయకులు బాలాజీ, చలపతి పాల్గొన్నారు.



ఆర్ఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యూనియన్ నాయకులు

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణానికి చెందిన మక్కినేని వేణుగోపాల్ అనే లబ్ధిదారుడికి సిఎం సహాయ నిధి ద్వారా రూ.1.40 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులను ముఖ్యమంత్రి తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు 3000 జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని, వివిధ నగరాల్లో ఆసుపత్రిలో చికిత్స చేయించుకొన్న ఆర్థికంగా వెనుకబడిన వారికి సిఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారని కొనియాడారు. అనంతరం మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యులు శారదారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నవాజ్ బాషా గొప్ప మనసున్న నాయకుడని, ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయడమే ఆయన నైజమన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారని కొనియాడారు. అనంతరం లబ్ధిదారుడు వేణుగోపాల్ మాట్లాడుతూ సిఎం సహాయనిధి ద్వారా తనకు నగదును అందజేసిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా, శారదరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

పింఛన్ల తొలగింపు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు తొలగించడం దురదృష్టకరమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిది ఆర్.జె.వెంకటేష్ ఆరోపించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1462 మంది సామాజిక భద్రత పింఛన్లను జిల్లాలో తొలగించడాన్ని ఆక్షేపించారు. స్వర్గీయ ఎన్.టి.రామారావు ప్రవేశపెట్టిన పింఛన్ విదానాన్ని తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కొనసాగించారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో అత్యధికంగా ఒంటరి మహిళలకు, ట్రాన్స్ జెండర్లకు, ఒకే కుటుంబంలో అర్హత కలిగిన ఇద్దరు వ్యక్తులకు ఇచ్చారని, జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంఖ్యను కుదిస్తూ సామాజిక భద్రత పింఛన్లను ప్రహసనంగా మార్చివేశారని విమర్శించారు. సకాలంలో ఉద్యోగస్తులకు జీతాలు, సామాజిక పింఛన్లు ఇవ్వలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. అప్పులు చేస్తూ సామాన్యులపై అధిక ధరల భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నవీన్ కుమార్, రామచంద్ర నాయుడు, రెడ్డప్ప, రాజన్న, మాజీ ఎంపిపి రామకృష్ణ పాల్గొన్నారు.

'యాదవుల అభివృద్ధికి ఏకమవ్వాలి'

ప్రజాశక్తి-కలికిరి

యాదవుల అభివృద్ధికి నియోజకవర్గం లోని యాదవులంతా సంకటితమవ్వాలని రాఘవేంద్ర యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్‌లు పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రం కలకడ రోడ్డు లోని రామునిగుడి వద్ద యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని యాదవులు జనాభా అధిక శాతం ఉందన్నారు. ఇప్పుడిప్పుడే రాజకీయ, ఆర్థిక, రంగాలలో అభివృద్ధి చెందుతున్నామని ఇది మన యాదవుల అభివృద్ధికి శుభసూచకమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్, మాజీ ఎంపిటిసి యతేంద్ర యాదవ్, వెంకటనారాయణ, ఈశ్వర్ యాదవ్, రాజేంద్ర యాదవ్, సుబ్రహ్మణ్యం, జనార్దన్, కుమార్, హరి, నాగరాజా, సుధాకర్, మురళి, గంగరాజు, బాలకృష్ణ, ప్రహల్లాద పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలు 'జగనన్నా నువ్వే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్' గోడపత్రాలను సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడా, ఆకేపాటి మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 20వ వరకు జగనన్న మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందరన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు యాదవ్, వడ్డే రమణ, మందరం గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు పసుపులేటి సుధాకర్, తంబసుబ్రహ్మణ్యం, నవీన్, రామ్మోహన్‌నాయుడు, సత్యాల రామకృష్ణ, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ సౌమిత్రి, బీసీ నాయకులు మనుబోలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

మదనపల్లె అర్బన్: కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. బుధవారం మదనపల్లి సంతగేటు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి దారులకు ఊడిగం చేసే విధానాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుపరం చేస్తుందని ప్రజల సంపద కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు.

నేడు గంగమ్మ జాతర

గాలివీడు: మండలంలోని బల్లిపల్లి నడింపల్లిలో గురువారం గంగమ్మ జాతరను వైభంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుషావతీ నది ఒడ్డున వెలసిన అసల గంగమ్మ జాతరకు చాందిని బండల ప్రదర్శనతో నిర్వహించేందుకు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు సన్నద్ధమయ్యారు. శుక్రవారం ఉదయం బోనాలు, మొక్కుబుడులు సమర్పించనున్నారు.



పాలడెయిరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

'పాలవెల్లువ'తో రైతుల్లో ఆనందం : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

జగనన్న పాలవెల్లువతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రామాపురంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన జగనన్న పాల డెయిరీ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేశారు. అమూల్ సంస్థ వారు నిర్వహించే పాలవెల్లువతో గ్రామాలలో పాడి రైతులు దూర ప్రాంతాలకు పోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో పాలు కొలిచే యంత్రాలు ఏర్పాటు చేసి ఆ కేంద్రాల ద్వారా పాలశీతల కేంద్రానికి తరలిస్తారని తెలిపారు. ప్రతి పాడి రైతుకు వారు వేసిన పాలకు పది రోజులకు ఒకసారి బిల్లు చెల్లించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పాల కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతులు ఆవులు, గేదెలను సంరక్షించుకొని పాల ఉత్పత్తి పెంచాలని అన్నారు. భూములు ఉన్న ప్రతి రైతులు పాల ఉత్పత్తులను పెంచేదిశగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అమూల్ సంస్థకు చెందిన అధికారులు రామాపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గడికోట జనార్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జడ్పిటిసి సభ్యుడు రమణ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి, వైఎస్ స్టేట్ వింగ్ జనరల్ సెక్రెటరీ సూరం వెంకట సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, పెద్దిరెడ్డి, ఆదిరెడ్డి, కాంట్రాక్టర్ తురక ఓబులేసు, గోపాల్ రెడ్డి, సత్యా యాదవ్, కర్లపు రామ్మోహన్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

మే 20న గురుకుల విద్యకు ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలంలోని గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతులకు, జూనియర్, డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందుటకు ఏపిఆర్ఇఐ సొసైటీ కార్యదర్శి ఆర్.నరసింహారావు ఉత్తర్వుల మేరకు మే నెల 20న 2023 జిల్లా ప్రధాన కేంద్రాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ యం.చెన్నకేశవులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 5, 6, 7వ తరగతి చదివి ఉండాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోరువారు 10 వ తరగతి, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశం కోరువారు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. వెబ్ సైట్‌లో అర్హత చూసుకొని సంతృప్తి చెందిన తరువాత మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతితో పాటు ఉచిత విద్యను కల్పిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించునప్పుడు ఫోటో, పుట్టినతేదీ, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు ఇవ్వాలని తెలిపారు. పరీక్ష ఫీజు పాఠశాల ప్రవేశ పరీక్ష కొరకు రూ.100 జూనియర్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్ష కొరకు రూ.300 చెల్లించాలన్నారు. వివరాల కోసం 9989924974, 9866559646 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు aps. [illegible].in వెబ్ సైట్ ను సంప్రదించాలని సూచించారు.



రైతుకు చెక్కును అందిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

నష్టపోయిన రైతుకు చెక్కు అందజేత

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కమ్మువారిపల్లి పంచాయతీ జింకలవారిపల్లి గ్రామానికి చెందిన కొనంగి రమణప్ప అనే పాడి రైతుకు చెందిన లేగదూడ గత సంవత్సరం సెప్టెంబర్ 21న హైనా దాడిలో మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. అడవి జంతువు దాడిలో పాడి పశువును కోల్పోయిన రైతు కుటుంబానికి పుంగనూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.12 వేలు చెక్కును బాధిత కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా చెక్కును తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కిరణ్ కిషోర్, శ్రీదేవి, సెక్షన్ ఆఫీసర్ సురేంద్ర పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాల సమర్పణ

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామంలోని బుధవారం బ్రాహ్మణవీధి ఆలయాల పునర్నిర్మాణం కొరకు కరిమిరెడ్డిగారిపల్లి వాస్తవ్యులు, కరిమిరెడ్డి కుమార్‌రెడ్డి బ్రాహ్మణవీధి ఆలయాల అభివృది కోసం విరాళంగా రూ.20వేలు, ప్రకటించారు. శ్రీ బ్రాహ్మణ వీధి ఆలయాల ఉత్సవ కమిటీ తరుపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. శ్రీవారి, మల్లిఖార్జున స్వామి వారి ఆలయాలు అభివృద్ధి కేవలం బ్రాహ్మణ వీధి ఆలయాల ఉత్సవ కమిటీ మాత్రమే చూసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో గోరాన్ చేరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసురాజు, వీరరెడ్డి రమేష్‌బాబు, హరి, ఉపేంద్ర ఋషి పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలో పది కిలోల చేప

ప్రజాశక్తి - రామసముద్రం

కాప్పల్లిపంచాయతి గజ్జలవారిపల్లి గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాసులు అనే మత్స్యకారునికి బుధవారం చెంబకూరు గ్రామానికి సమీపంలోని చెల్లాచెరువులో చేపలు పట్టే క్రమంలో దాదాపు పది కిలోల బరువు కలిగిన చేప వలలో చిక్కింది. ఇప్పటివరకు చెల్లా చెరువులో ఎన్నడూ ఇంత పెద్ద చేప దొరకలేదని తనకు పదికిలోల చేప దొరకడంతో తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రధానరోడ్డు మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు పది కిలోల చేపను ఆసక్తిగా తిలకించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీకి అభినందనలు

ప్రజాశక్తి-నందలూరు

ఆటోలో బాడుగ వచ్చిన వారు మరిచిపోయిన నగదుతో ఉన్న హ్యాండ్ బ్యాగ్ ను తిరిగి వారికే పోలీసుల సమక్షంలో ఆటో డ్రైవర్ అందించారు. అతని నిజాయితీకి స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు. పాటూరు కు చెందిన తురక మనోహర్, అతని కుమార్తె అఖిల ఒంగోలులో చదువుతున్న వారి పాప స్కూల్ ఫీజు కట్టడానికి నందలూరు బస్టాండ్ కు ఆటోలో వస్తూ హ్యాండ్ బ్యాగ్ ను ఆటోలోనే మర్చిపోయారు. ఇది గమనించిన కొనరాజు పల్లెకు చెందిన ఆటో డ్రైవర్ బాలిపోగు రాజా పోలీసుల సమక్షంలో హ్యాండ్ బాగ్ ను పోగొట్టుకున్న వారికి అప్పజెప్పాడు. అతని నిజాయితీకి హెడ్ కానిస్టేబుల్ షామీర్, పోలీసులు దర్బార్ భాష, రహీం బాబు తో పాటు స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు.



హ్యాండ్ బ్యాగ్‌ను బాధితులకు అందిస్తున్న ఆటో డ్రైవర్ రాజా

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బడుగు, బలహీనవ వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని జడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి కొనియాడారు. బుధవారం డిసిసి చైర్మన్ దండు గోపి, ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు బొజ్జ పెంచలయ్య ఆధ్వర్యంలో ఒసి క్లబ్ ప్రాంగణంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోలా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం ఆయన పోరాటం మరచిపోలేనిదని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు చొప్పా గంగిరెడ్డి, జడ్పిటిసి పెంచలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మైనార్టీ నాయకులు అబ్దుల్ మున్నాఫ్, నాగేంద్ర పాల్గొన్నారు. **చమర్తి ఆధ్వర్యంలో ..** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబుజగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిదన్నారు. స్వతంత్ర సమరయోధులు, సమాజంలో అణగారిన వర్గాల కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త, దళిత, బహుజనుల సంక్షేమం కోసం అవిశ్రాంత కృషిచేసి భారతదేశ ఉప ప్రధానిగా దేశానికి సేవలు అందించిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో అయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల సాగర్, మండల సీనియర్ నాయకులు జీ.వీ సుబ్బరాజు, టిడిపి మండల ఉపాధ్యక్షులు సతీష్ రాజు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుహేల్, పార్లమెంట్ మైనారిటీ నాయకులు కరీముల్లా, విజయ్ నాయుడు, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ రాజు, బుడెన్ సాహెబ్, తులసి, నాగేంద్ర, గురు నాయుడు,రాజేష్ వర్మ పాల్గొన్నారు. **పీలేరు:** బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా పట్టణంలోని బహుజన సంక్షేమ సంఘం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బహుజన సంక్షేమసంఘ సభ్యులు



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చమర్తి జగన్మోహన్‌రాజు

కార్యాలయంలో పూలే, అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పూలే అంబేద్కర్ స్టేట్ కో-ఆర్డినేటర్ బలరాం పాల్గొన్నారు. దేశంలో ప్రజారాజ్య నిర్మాణానికి నిరంతరం కృషి సాగించిన వ్యక్తి చరిత్రలో దశాబ్దాల పాటు ఎందరో పదవులు చేపట్టిన వారు ఎందరున్నా హేతుబుద్ధి, సానుకూల దృక్పథం, స్థిరమైన సంకల్పం, ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఇవన్నీ కలబోసిన గొప్ప మేధాశక్తి ఉన్న ఏకైక నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన యాభై ఏళ్ళ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చేపట్టి పదవులకే వన్నె తెచ్చిన గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మహబూబ్ బాష, ప్రభాకర్ రాజు పార్స్ సభ్యులు రవికుమార్, మల్లికార్జున, మదార్, ఎస్.అంజి, రమణ, మస్తాన్, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**: సామాజిక రాజకీయ బానిసత్వంపై జీవితాంతం యుద్ధం చేసిన వ్యక్తి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వేముల సుదర్శనం అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో బాబు జగ్జీవన్ రావ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు యమాల చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, మాన్యక్యం, పదం శివన్న, లక్ష్మి పతి, కోప్పల రామచంద్ర, అప్పయ్య, రమణ, ఆరోగ్య వరం మోహన్, పెద్దన పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణంలో జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సహదేవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడప గిరిధర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చక్రి, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొని జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ అని కొనియాడారు. కార్యక్రమంలో బిసి నాయకులు ఆనంద్, మైనార్టీ నాయకులు షాకీర్ హుస్సేన్, ఎస్‌టి నాయకులు కాలనీ చిన్న, నాగార్జున, మౌలా, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎర్రయ్య, వెంకటరమణ, హుసేనయ్య, నాగరాజ, చరణ్, ద్వారక, వెంకటేష్, రమణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- కంభంవారిపల్లి

మహిళల ఆర్థికాభవృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అథితిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పొదుపు సంఘాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు నిర్వీర్య దశకు చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణకు, ఆత్మగౌరవనాకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మహిళ రక్షణకు దిశ యాప్, మహిళల పేరుతోనే ఇళ్ల స్థలాలు, బిల్లులు, పేదరిక నిర్మూలనకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారిత విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాల అమలు చేయడంలో రాజీ పడడం లేదన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎపిడిబి సత్యనారాయణ మండల వైసిపి అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, హౌసింగ్ బోర్డ్ మెంబర్ కారపాకల భాస్కర్ నాయుడు, జడ్‌పిటిసి గజ్జల శృతి సీన్ రెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు, సంఘమిత్రలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రజల సంక్షేమం, అభివృద్దే ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత సదస్సులలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలుపెరగని పాదయాత్రలో అక్క చెల్లెమ్మలుకు జగనన్న ఇచ్చిన హామీ నేడు మూడు విడతలుకు కార్యరూపం దాల్చిందన్నారు. వైఎస్ఆర్ ఆసరా మూడవ విడతలో మండలంలో 436 సంఘాలకు రూ 3.8 కోట్లు లబ్ది చేకూరిందన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుబ్బరాయుడు, ఎంపిటిసిలు, లక్ష్మీనారాయణ శంకర్ నాయుడు జగన్మోహన్ రెడ్డి సర్పంచులు సిద్ధక నాగిరెడ్డి రమణ జనార్దన్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, వైసిపి నాయకులు సుబ్బరాజు, రవి, రమణ, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైభవంగా రాములోరి కల్యాణం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

మండల పరిధిలోని చలం పాలెం గ్రామంలో బుధవారం రాములోరి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు డిఆర్‌యుసిసి మెంబర్ తల్లం భరత్ కుమార్‌రెడ్డి, శివరామరాజు కలిసి రాములవారి కల్యాణోత్సవ పూజలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణలు మధ్య కమనీయం..రమణీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాలువ వెంకటరామరాజు, ప్రసాదరాజు, చైతన్య, పుల్లగంటి, నరేందర్‌రెడ్డి, రాముడు, మురళి సుబ్బయ్య, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

సాంస్కృతిక మండల సమావేశం

పజాశక్తి-పెద్దమండ్యం

మండలం సాంస్కృతిక విభాగ మండల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమవేశానికి ముఖ్య అతిధిగా సాంస్కృతిక జిల్లాఅధ్యక్షులు నారపారెడ్డి సుధాకర్‌రెడ్డి, తంబళ్లపల్లి అనసూయ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో కనుమరుగువుతున్న కళలు చెక్కభజన, కోలాటం, పండరిభజన, పిల్లనగ్రోవి, జానపద కలలును వెలికి తీసి కలనైపుణ్యాన్ని పెంపొందించుటకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన కళాకారులకు అయిదు వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కుటుంబంలో ఎవరైన కళాకారులు చనిపోతే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. సమావేశంలో తంబళ్లపల్లి ఎంపిపి అనసూయ నారాయణరెడ్డి, చైర్మన్ రెడ్డిమలిరెడ్డి, మల్లయ్యకొండ ధర్మకర్త వి.ప్రభాకర్‌రెడ్డి,, సంస్కృతిక విభాగం అధ్యక్షులు కలిచర్ల కత్తి శివమణి గారు, తంబళ్లపల్లి మహిళా నాయకురాలు వి.రాధా, నిర్మల కందుకూరి మలిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, అంజప్ప, నాగమల్లు, శివాంజనేయలు, హరినాథ్ సోముశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చందాలు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సర్పంచ్ సూర్యనారాయణ

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు బస్టాండ్ వద్ద ఆర్ఎస్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం ఎవరైనా చందాలు అడిగితే దాతలు ఎవరు ఇవ్వవద్దని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొందరు సంబంధం లేని వ్యక్తులు ఆవిష్కరణ పేరు చెప్పి లక్షల రూపాయలు చందాల వసూలు చేస్తున్నారని తెలిసిందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఎవ్వరికి చందాలు ఇవ్వవద్దని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు పెనుబాల నాగసుబ్బయ్య, రాష్ట్ర దళిత ఐక్యవేదిక అధ్యక్షులు కాకి చంద్రమోహన్, రాష్ట్ర దళిత నాయకుడు ఆరుముగం విశ్వనాథ్, మోడపోతుల రాము, కంభం నాగరాజు, బద్రి రెడ్డి, పవన్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలుపెరుగని శ్రామికుడు దొరస్వామి

మదనపల్లె అర్బన్ : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అలుపెరుగని శ్రామికుడిలా రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామి నాయుడు పనిచేస్తున్నారని ఆ పార్టీ నాయకులు కితాబునిచ్చారు. బుధవారం పట్టణంలోని స్థానిక దేవతానగర్ రాజంపేట పార్లమెంట్ టిడిపి కార్యాలయంలో దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిది గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర యాదవ్, తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్,తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ,ప్రధాన కార్యదర్శి బాబ్ జాన్,పూల మురళి,పెద్దమండ్యం మాజీ అధ్యక్షులు సిద్ధవరం ప్రసాద్, బి.శ్రీరాములు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌ఖాన్,, ప్రభాకర్, శ్రీనివాసులు, బెస్త సాధికార సంఘం జిల్లాఅధ్యక్షులు ముంబై దుర్గా, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసేవ అభినందనీయం

పులివెందుల రూరల్ : పురపాలక 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ ప్రజలకు చేసే సేవలు మరువలేనివని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి సౌజన్యంతో కిషోర్ తన తల్లి పార్నపల్లి బాలమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన డాక్టర్ ఇసి గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు ఓతూరి రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, విజయ్ కుమార్ నాయుడు, లక్ష్మి భార్గవి, శాంతమ్మ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని బాలాజీ క్లాత్ మార్కెట్ దగ్గర కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతల ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని ప్రశంసించారు. వైసిపి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు నరకం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు నరకం కనబడుతోందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. మండలం కోడూరు గ్రామపంచాయతీలో బుధవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల పార్టీ బాధ్యులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి. రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి కొండయ్య యాదవ్. రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సూర్య పెద్దరాజు. కోడూరు పార్టీ నాయకులు శివశంకర్‌రెడ్డి, ఓబులేసు, మల్లికార్జున్‌రెడ్డి, బండి శివశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



రమేష్ కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అగ్రహారం కార్యకర్తలు

వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యం : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-లక్కినపల్లి

వచ్చే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా అగ్రహారం, దియ్యాలవాండ్లపల్లి, వేల్పుచర్ల వాండ్లపల్లి, రాజులపల్లి, మంగళపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతానికి వెళ్లినా టిడిపి చేసిన అభివద్ధి కళ్ళ ముందు కనిపిస్తుందని అన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా సౌకర్యంగా ఉండేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప ఆలోచనతో జిప్లస్‌త్రీ ఇళ్లు నిర్మిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లు దాటినా లబ్ధిదారులకు అప్పగించలేకపోయారని ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో జగనన్న కాలనీల పేరుతో నాసిరకంగా ఇళ్లను కడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రజలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలాడిప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామరాజు, మండ్ల రామాంజనేయులు, మావిళ్ళ గిరి బాబు, కొత్తపల్లె నాగేంద్ర, కొత్తపల్లె క్రిష్ణా కిషోర్, మండ్ల పవన్‌కుమార్, కొండూరు గజపతిరాజు, ఉప సర్పంచ్ వెంకట్రామరాజు, సగిలి యోగంజినేయులు, మండ్ల వెంకటేష్ దాదినేని శివాంజీ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు పెద్దమండ్యం మండల అధ్యక్షులు మరియు క్లస్టర్ ఇంచార్జ్ జిట్టా వెంకటరమణ ఆధ్వర్యం లో పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లి, సిగొల్లపల్లి పంచాయితీలో యూనిట్ ఇన్‌ఛార్జి మాజీ సర్పంచ్ రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కాలేష, రమేష్ తెలుగు యువత అధ్యక్షులు నార గంగాధర, రఘునాథ యాదవ్, గ్రామ అధ్యక్షులు, పెద్దన్న ఓబులేసు యాదవ్ ,డి వెంకటరమణ యాదవ్, సర్పంచ్ నటరాజనాయక్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు : ఎఒ

బి.కొత్తకోట : మండలంలోని 12 రైతుభరోసా కేంద్రాలు 114 రీటైల్ ఎరువుల దుకాణాలలో రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి మురళీ మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా గడచిన 15 రోజులలో 64.5 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 13 మెట్రిక్ ఉన్నుల యూరియా, 12 మెట్రిక్ టన్నుల డిఎపి ఎరువులు రైతుభరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల అవసరాల మేరకు ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రయివేట్ రిటైల్ ఎరువుల దుకాణాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువుల నిలువల వివరాలు ఇలా ఉన్నాయన్నారు. యూరియా-49.245, డిఎపి 16.295, ఎస్ఎస్ పి 20.750, ఎండిపి-450,20:20:0:13-51.350,10:26:26 -126.60,16:20:0:13-4.950,14:35 :14 - 36.40,9 ఇతర కాంప్లెక్స్ ఎరువులు-77.25 కలిపి మొత్తం 434.945 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. గత నెలలో రైతు భరోసా కేంద్రాలు ప్రయివేట్ రీటైల్ దుకాణాలలో దాదాపు 175 టన్నుల ఎరువులు సరఫరా చేశామన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గిరిజనులకు చీరలు పంపిణీ

చిట్వేలి : సీనియర్ రాజకీయ నేత చాంగండి హరి రామ జోగయ్య జన్మదినం పురస్కరించుకొని మండలం లోని రాజారెడ్డి గిరిజన కాలనీలో కడప, అన్నమయ్య, కాపు సంక్షేమ సేన జిల్లాల కోఆర్డినేటర్ య ర్రం శెట్టి మస్తాన్ రాయలు ఆధ్వర్యంలో గిరిజనులకు చీరలు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోగయ్య నాటి తరం-నేటి తరం రాజకీయాలకు వారధి వంటి వారు చట్టసభల సభ్యునిగా, మంత్రిగా తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చారన్నారు రాజకీయాల్లో ధైర్యం ఆత్మ అభిమానంతో ఎలా పని చేయవచ్చో ఆయన ఎనిమిదిన్నర దశాబ్దాల వయసులో కూడా విశ్రాంతికి పరిమితం కాకుండా ఇప్పటికీ చేస్తున్న రాజకీయ శ్రమ కొనియాడదగినది అన్నారు. ఆయన తన జన్మదినాన్ని అణగారిన వర్గాల మధ్య జరుపుకోవడం ఆయనలోని మంచితనానికి నిదర్శనంగా భావిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసి నరసింహ, మాదాసు శివ, హరి, కాపు సంక్షేమ సేన నాయకులు, గిరిజన కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి సమీపంలోని దామరఒడ్డులో మంగళవారం మధ్యాహ్నం పెద్దమాదిగ పల్లెకు చెందిన పి.సుధాకర(35) అనే వ్యక్తి ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయిన సంఘటన చోటు చేసుకుంది. అయితే మృతదేహం ఆచూకీ కోసం తహశీల్దార్ సిఆర్.మంజుల ఆదేశాల మేరకు రెండు రోజులుగా నిమ్మనపల్లి పోలీసులు, వాల్మీకిపురం అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టిన ప్రయోజనం లేకపోయింది. మంగళవారం సాయంత్రం చీకటి పట్టడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. రెండవ రోజు బుధవారం ఉదయం నుంచి స్థానిక సర్పంచు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు స్థానికులతో కలిసి మృతదేహం కోసం తీవ్రంగా గాలించారు. దామర ఒడ్డులో నీటి లోతు అధికంగా ఉండటంతో నీటి లోపలికి కెమెరాను వదిలి మృతదేహంను గుర్తించటానికి అధికారులు ప్రయత్నించగా లాభం లేకపోవడంతో చివరకు ఒడ్డు మొరవ కట్టను జెసిబి సాయంత్రం తెంపి నీటిని బయటకు వదిలి గాలిస్తున్నారు. మృతదేహం ఆచూకీ కనుగొనడానికి ఆలస్యం అవుతుందని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సుధాకర మృతదేహం కోసం రోదిస్తున్నారు. తాహశీల్దార్ మంజుల, పోలీస్ సిబ్బంది కేశవ, శివ, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసులు, రవి, కిరణ్, విఆర్ఒ రజనీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి- కలకడ

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు. స్థానిక పోలీసులు సమాచారం మేరకు వివరాలు..సుండుపల్లి మండలం ఎర్రమనేనిపాలెంకు చెందిన వెంకటేశ్వర్లు అతని స్నేహితుడు రెడ్డిబాబులు కలిసి ద్విచక్ర వాహనంలో కలకడకు వచ్చి తిరిగి వారి స్వగ్రామానికి బయలుదేరారు. బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి వద్ద జాతీయ రహదారిలో వీరికి ఎదురుగా రాయచోటి నుంచి చిత్తూరుకు వెళుతున్న చిత్తూరు జిల్లా జంగాలపల్లికు చెందిన ఆర్.శేఖర్ కారు అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ద్విచక్ర వాహనం ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, రెడ్డిబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు.